క్లుప్తంగా

వైద్య చికిత్సకు చేయూత



చిట్యాల : సాయికుమార్‌కు నగదు అందజేస్తున్న స్నేహితులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన మేడి సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతని వైద్య చికిత్స ఖర్చులకుగాను చేయూతనందించేందుకు అతనితో కలిసి చదువుకున్న ఆ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ 2011–12 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ముందుకు వచ్చారు. వారంతా కలిసి సేకరించిన రూ.35వేలను ఆదివారం సాయికుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌కె.జహంగీర్, శ్రీశైలం, మహేష్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



రవికి నగదు అందజేస్తున్న స్నేహితులు

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన రూపని రవి ఇటీవల హార్ట్ ఎటాక్‌తో మృతిచెందాడు. దీంతో రవి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించేందుకు ముందుకు వచ్చారు.. అతని స్నేహితులు. వారంతా సేకరించిన రూ.60వేలను ఆదివారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జన్నపాల శ్రీను, పాకాల సత్యానారాయణ, చెరుకు వెంకన్న, రవి,రాజు, స్వామి, పరమేష్, రమేష్, స్వామి గణేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న చెరుకు లింగంగౌడ్

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ ఆలయ కమిటీ సభ్యుడు ముద్దం శ్రీనివాస్‌గౌడ్‌కు రూ.10వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, పోలగోని రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక

నకిరేకల్ : పీఆర్‌టీయూ నకిరేకల్ మండల నూతన కమిటీని ఆదివవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంటల ఆనంద్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా చిక్కుళ్ల సుధాకర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికై న కమిటీని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు.

రాధాకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళి

నల్లగొండ టౌన్: కష్టజీవులు, కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు యానాల రాధాకృష్ణారెడ్డి అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలో రాధాకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన సందర్భంగా వీరారెడ్డి మాట్లాడారు. రాధాకృష్ణ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నివాళులర్పించిన వారిలో సయ్యద్ హాశం, దండంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, ఊట్కూరి మధుసూదన్‌రెడ్డి, బొల్లు రవీంద్రకుమార్, యానాల ప్రభాకర్‌రెడ్డి, యానాల కరుణాకర్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

రాచకాల్వ ఎస్కేప్ తూములకు షట్టర్ల బిగింపు



రాచకాల్వకు షట్టర్లు అమరుస్తున్న ఇరిగేషన్ ఏఈ, రైతుప్రతినిధులు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే ప్రధాన రాచకాల్వ నుంచి రామన్నపేట మండలం తుర్కపల్లి వద్ద పూర్తిగా ధ్వంసమై ఉన్న ఎస్కేప్ తూముల నుంచి వృథాగా పోతున్న వరదనీటిని అరికట్టేందుకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చొరవతో ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే ప్రాజెక్టు ఆయకట్టు రైతుప్రతినిధులు సొంత నిధులు రూ. 3.20 లక్షల వ్యయంతో తయారు చేయించిన నాలుగు షట్టర్లను ఆదివారం ఎస్కేప్ తూములకు బిగించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రాములు, ప్రాజెక్టు ఆయకట్టు రైతుప్రతినిధులు చామల వెంకటరమణారెడ్డి, పడాల రమేష్, గూని వెంకటయ్య, నిమ్మల కృష్ణమూర్తి, బంటు బీరప్ప, పెంబెల్ల శ్రీను, పాల్గొన్నారు.

ఇంటింటికీ జ్వర పీడితులే !

ఈ ఫొటోలో కనిపిస్తుంది.. నకిరేకల్‌లోని పద్మశాలీ కాలనీ వాసి దూదిమెట్ల అంజమ్మ. ఈమె రోజు వారీగా కూలి పనులు చేసుకుంటూ జీవన సాగిస్తుంది. వారం రోజుల క్రితమే జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులతో మంచమెక్కింది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రూ.10వేల పైనే ఖర్చు పెట్టినా నయం కాలేదు. ఇలా.. ఈ కాలనీలో ఒక్క అంజమ్మే కాదు. ఇంకా పదుల సంఖ్యలో రోగులు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు.





పద్మశాలీ కాలనీలో కాల్వలో పారుతున్న మురుగు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాలనీ వాసి

- నకిరేకల్‌లోని పద్మాశాలీ కాలనీలో వీధుల్లోనే పారుతున్న మురుగు నీరు
- డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- ప్రబలుతున్న వ్యాధులు

నకిరేకల్ : మారుతున్న వాతావరణ పరిస్థితులకు తోడు.. దోమల సంచారం.. ఆపై మురుగు నీటి సమస్యతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. నకిరేకల్ పట్టణంలోని 2వ వార్డులోని పద్మాశాలీ కాలనీలో పక్షం రోజుల నుంచి విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈకాలనీలో సూమారు 50పైనే కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ వారంతా చేనేత మగ్గం పనిమీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పదిరోజులుగా ప్రతి ఇంట్లో ఇద్దరు చొప్పున జ్వరాల బారిన పడి ఆస్పత్రుల బాట పడుతున్నారు. ప్రధానంగా మలేరియా, టైఫాయిడ్‌తో పాటు చికున్‌గన్యా వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. అసలే చేనేత మగ్గం పనిమీద రోజు వారీగా నేసిన దుస్తులపై వచ్చే కూలీతో అంతంత మాత్రంగా సాగుతున్న ఆ కుటుంబాలను విషజ్వరాలు వెంటాడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. కాలనీలో వారం రోజుల నుంచి మంగళవారం వరకు సూమారు 30మందిపైనే జ్వరాలు, చికున్‌గన్యా తో సతమతమవుతున్నారు. ప్రధానంగా దోమలతో ఈ జ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ వైద్యాధికారులు స్పందించి కాలనీలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరాలబారిన పడకుండా అవగాహన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అంతంత మాత్రంగానే స్వచ్ఛదనం

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ఈ కాలనీలో అంతంగా మాత్రంగానే చేపట్టారు. వీధుల వెంట, ఇళ్ల ముందు ఎక్కడ పడితే అక్కడే పిచ్చిమొక్కలు కనిపిస్తున్నాయి. కాలనీలో ఓ వీధిలో డ్రైయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్డుపై మురుగునీరు పారుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

రక్తకణాలు పడిపోయాయి



వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నా. కీళ్ల నొప్పులతో పాటు రక్తకణాలు తగ్గిపోయాయి. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నా. అయినా ఇంకా నొప్పులతోనే ఇబ్బంది పడుతున్నా. కాలనీలో క్యాంప్ ఏర్పాటు చేయాలి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున మొత్తం వ్యాపించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి.

– బాల్నె శ్రీనివాస్, పద్మశాలీకాలనీ

వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి



2వవార్డులోని పద్మశాలీకాలనీలో పారిశుద్ధ్యం విషయంలో తగు చర్యలు తీసుకుంటున్నా ం. అన్ని వీధుల్లో ఉన్న డ్రైయినేజీల్లో పూడిక తొలగించాం. మురుగుకాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాం. వైద్యాధికారులకు కూడా కాలనీ సందర్శించారు. కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి.

– రాచకొండ సునీల్‌గౌడ్, 2వవార్డు కౌన్సిలర్

● మెట్ట పంటలకు జీవం



మునుగోడులో కళకళలాడుతున్న పత్తి చేను

మునుగోడు మండల వ్యాప్తంగా వారం రోజులుగా అడపా, దడపా కురుస్తున్న వర్షాలు మెట్ట పంటలకు జీవం పోస్తున్నాయి. నెల రోజులకుపైగా వరుణుడు ముఖం చాటేయడంతో మండల వ్యాప్తంగా దాదాపు 35వేల ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంటలు వాడిపాయే స్థితికి చేరుకున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి చేలు కళకళలాడుతున్నాయి. పంట ఎదుగుదలకు అవసరమైన ఎరువులు పెట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది భారీ వర్షం కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి మండలంలోని చెరువుల్లో చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి.

– మునుగోడు

మంద కృష్ణమాదిగను కలిసిన టీఎంఎంఎస్‌ఎం ప్రతినిధులు



మంద కృష్ణమాదిగతో టీఎంఎంఎస్‌ఎం ప్రతినిధులు

చిట్యాల: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను ఆదివారం హైదరాబాద్‌లో టీఎంఎంఎస్‌ఎం(తెలంగాణ మాదిగ మహా సంఘం ముంబాయి) ప్రతినిధులు కలిసారు. ఈ సందర్భంగా వారు ఆయనను ఘనంగా సన్మానించి, అభినందించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వలస మాదిగలు మహారాష్ట్రలో సైతం ఉన్నారని తెలిపారు. వారికి కూడా కుల ధ్రువీకరణ, రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎంఎంఎస్‌ఎం అధ్యక్షుడు ఎర్రోళ్ల లక్ష్మణ్, గంగడోల్ల రాజారామ్, నల్లూరి బాబు, నాగెల్ల దేవనంద్, పొలిమేర దశరథ, మేకల హన్మంతు, దివాకర్ యాదవ్, సుదర్శన్, తిమ్మయ్య, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణలోపం.. నిలిచిన సేవలు



పోలీస్‌స్టేషన్ సమీపంలో మూతపడిన టాయిలెట్స్



బస్‌స్టేషన్‌లో తాళం వేసి ఉన్న టాయిలెట్స్

- చిట్యాలలో మూతబడిన పబ్లిక్ టాయిలెట్స్
- వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి

చిట్యాల: వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన టాయిలెట్స్ నిర్వహణ లోపంతో మూతపడ్డాయి. చిట్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్, పోలీస్‌స్టేషన్ సమీపంలోని టాయిలెట్స్ నిర్వహణ లేక మూత పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కొన్నేళ్లుగా..

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపారాల నిమిత్తం దూర ప్రాంతాలనుంచి చిట్యాల పట్టణానికి వచ్చే ప్రజలు, ప్రయాణికుల అవసరాల కోసం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో నాలుగేళ్ల క్రితం మున్సిపాలిటీ నిధులతో పబ్లిక్ టాయిలెట్‌ను నిర్మించారు. వాటిని ప్రారంభించిన అనంతరం నిర్వహణ పట్టించుకోలేదు. దీంతో ఆ టాయిలెట్ వినియోగంలోకి రాకుండానే అన్ని సౌకర్యాలతో నిర్మించిన నిరుపయోగంగా మారింది.

ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో..

చిట్యాలలోని జాతీయ రహదారిపై ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో కొద్దిరోజులుగా టాయిలెట్స్‌ను మూసి వేశారు. ఈ టాయిలెట్స్ నిర్వహణ సరిగా లేకపోవటంతో నిండిపోయింది. దీంతో స్టేషన్‌లో టాయిలెట్స్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఆ బస్‌స్టేషన్ ఆవరణలో ఆరుబయట మూత్ర విసర్జన చేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. వెంటనే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని టాయిలెట్స్ నిర్వహణ చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బీపీ మండల్ చిత్ర పటానికి నివాళి

నల్లగొండ టౌన్: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ 106వ జయంతి సందర్భంగా ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్లాక్ టవర్‌లో మహాత్మా జ్యోతిరావుపూలే వద్ద మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు మాట్లాడుతూ బీపీ మండల్ బీసీల రిజర్వేషన్ల సాధనకు విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కాసోజు విశ్వనాథం, కంది సూర్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, కేశబోయిన శంకర్, నకిరెకంటి కాశయగౌడ్, సమీర్‌కుమార్, ఆనంద్‌కుమార్, సాయిబాబా, తరాల పరమేష్, జల్లా ఆదినారాయణ, గీత పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న జానయ్య

మునుగోడు: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతి వృత్తులకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య సూచించారు. ఆదివారం మండలంలోని చొల్లేడు గ్రామంలో పలువురు చేతి వృత్తి దారులకు విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పించి పలువురి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతి వృత్తి దారులకు 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు రోజుకు రూ. 500ల నగదు అందచేస్తారన్నారు. అంతే కాకుండా బ్యాంక్ ద్వారా రూ. 3లక్షల వరకు రుణం పొందేందుకు అవసరమైన అర్హత పత్రాలని అందచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిపుర సుందరి అమ్మవారి ఊరేగింపు



త్రిపురసుందరి ఊరేగింపులో గ్రామస్తులు

తిప్పర్తి: తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధి తిప్పలమ్మగూడం గ్రామంలో వెలిసిన శ్రీ త్రిపురసుందరి (తిప్పలమ్మ)అమ్మవారి ఊరేగింపు వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు.తెల్లవారు జామునుంచి అమ్మవారిని అలకరించి డప్పు చప్పుళ్లతో భజనలతో తిప్పలమ్మగూడం, తిప్పర్తి, సైదిబాయిగూడెం, నూకలవారిగూడెం తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. ప్రజలు ప్రతి ఇంటి ముందు అమ్మవారికి నీరు ఆరబోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుర్రం మాదవరెడ్డి, పాల్వాయి సత్తిరెడ్డి, వల్లపురెడ్డి యాదగిరి రెడ్డి,గుర్రం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

శాలిగౌరారం: కాలపరిమితి లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలం నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, కారింగుల వెంకన్న, మక్క బుచ్చిరాములు, కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, సైదుల శ్రీను, బట్ట రామచంద్రు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

మునుగోడు: తమతో పాటు విద్య అభ్యసించి వివిధ కారణాల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తోటి విద్యార్థులకు ఆర్థికసాయం అందచేసి మానవత్వం చాటుకున్నారు.. మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు. ఆదివారం ఆ విద్యార్థులంతా అదే పాఠశాలలో కలుసుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అనంతరం శక్తి తమ కొద్దీ దాదాపు రూ. 90వేల వరకు పొగుచేసి చనిపోయిన విద్యార్థుల కుటుంబ సభ్యులతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి రూ.5వేల నుంచి రూ.10వేల చొప్పున సహాయం అందించారు.

సాక్షి ఫొటో జర్నలిస్టుకు సన్మానం

నల్లగొండ టౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రెండు జాతీయ అవార్డులు పొందిన సాక్షి ఫొటో జర్నలిస్టు కంది భజరంగ్ ప్రసాద్‌ను ఆదివారం శక్తి న్యూ వాయిస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో ఇప్పటికే 77 అవార్డులు సాధించడం జిల్లాకు ఎంతో గర్వకారణమని క్లబ్ అధ్యక్షురాలు దగ్గుపాటి విమల అన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ మామిడాల మాధవి, జోన్ చైర్మన్ మామిడి పద్మ, ఫాస్ట్ ప్రెసిడెంట్ అమరావతి, పద్మా క్రాంతి, సభ్యులు పెండ్యాల సరిత, డి సుజాత, తోగిటి ఇందిర, ఎస్ సుస్మిత పాల్గొన్నారు.



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

నకిరేకల్ : నకిరేకల్‌కు చెందిన ప్రముఖ డాక్టర్,లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ యానాల మోహన్ రెడ్డి సతీమణి శాంతమ్మ అంత్యక్రియలు అశ్రునయాల మధ్య ఆదివారం జరిగాయి. అంతిమయాత్రలో నకిరేకల్ ఎమ్మెలే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, టీపీసీసీ నేత దైద రవీందర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: నల్లగొండలో సోమవారం నిర్వహించనున్న బెల్లయ్యనాయక్ ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్ కోరారు. ఆయన ఆదివారం అంబేద్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరగనున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆత్మీయ సన్మాన సభకు ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, జైవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో లంబాడాలు, ప్రజా సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



నల్లగొండలోని గోకుల్‌నగర్‌లో శివసత్తుల విన్యాసాలు, బోనాలతో మహిళలు



నల్లగొండ : రామగిరి ముత్యాలమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): శ్రావణమాసం సందర్భంగా నల్లగొండ పట్టణంలో ఆదివారం బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ కాలనీల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు దేవతలకు బోనాలను సమర్పించుకున్నారు.

కాలనీల్లో..

నల్లగొండ పట్టణం 11వ వార్డు హౌజింగ్ బోర్డు కాలనీలో ఆదివారం బోనాల పండుగ వేడుక ఘనంగా జరుపుకున్నారు. కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా బోనమెత్తుకున్నారు. భక్తి శ్రద్ధలతో కాలనీలోని ముత్యాలమ్మకు బోనాలను సమర్పించుకున్నారు.

ముత్యాలమ్మ దేవాలయంలో....

నల్లగొండ పట్టణంలోని రామగిరి ముత్యాలమ్మ దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆలయ చైర్మన్ ఎలిజాల అంజయ్య, సుమతమ్మ, అబ్బగోని కవిత, పవన్, శివ, మహేష్, మనీ, చంద్రకళ, మానస, జ్యోతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ నగర్‌లో...

నల్లగొండ పట్టణంలోని గోకుల్ నగర్ వాసులు ఆదివారం బోనాల పండుక జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ దేవరాపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మామిళ్ల సైదులు, కార్యదర్శి జంగాల స్వామి, కోశాధికారి మోహన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కంచర్ల రాము ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు నెల్లికంటి వెంకన్న, కుంభం సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ ప్రజలు ఆదివారం బోనాల పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని యాదవ కులస్తులు ఆదివారం పెద్దమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. వేడుకలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, జేరిపోతుల భరత్, యాదవ్ కులస్తులు తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మ నెలవారీ పండుగ

నకిరేకల్ : నకిరేకల్‌లోని ముత్యాలమ్మ నెలవారీ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి నైవైద్యం సమర్పించారు. ఈవేడుకల్లో టీపీసీసీ నేత దైద రవీందర్, వార్డు కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి,చౌగోని రాములమ్మ సైదులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగదారి యోగానందం, కార్యదర్శి యాసారపు వెంకన్న పాల్గొన్నారు

మర్రిగూడః మండలంలోని ఖుదాభక్షపల్లి గ్రామంలో ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఘట్టం ఎత్తుకుని శివసత్తుల, పోతురాజుల ఆటపాటలతో డీజే చప్పుల్లతో ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో పందుల పాండుగౌడ్, ఊరిపక్క జంగయ్య, జావీద్, గిరి, జీవన్, లింగం, సైదులు, మహిళలు పాల్గొన్నారు.

తిప్పర్తిలో..

తిప్పర్తి: మండలంలోని అంతయగూడెం గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలందరూ ఇంటికో బోనం ఎత్తుకొని ముత్యాలమ్మ ఆలయం వద్దకు ర్యాలీగా డబ్బు చప్పులతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిరిగిరి పద్మ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం



కట్టంగూర్ : అంబేద్కర్‌నగర్‌లో బోనాలతో మహిళలు



నల్లగొండ : హౌజింగ్‌బోర్డు కాలనీలో బోనాలతో మహిళలు



మర్రిగూడ : ముత్యాలమ్మ బోనాల ఉత్సవంలో పోతురాజులు